క్లుప్తంగా

గుండెపోటుతో హెచ్‌ఎం మృతి


సాయన్న (ఫైల్)

కుభీర్: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేసే జంగిలి సాయన్న (58) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఈయన 30 ఏళ్ల జిల్లాలోని వివిధ పాఠశాలలో పని చేయగా 2023 నుంచి కుభీర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా కొనసాగుతున్నారు. సాయన్నకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కేటీఆర్‌తో సమావేశం


కేటీఆర్‌తో జాన్సన్‌నాయక్

ఖానాపూర్: నియోజకవర్గాల వారీ గా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ బలోపేతంపై మంగళవారం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ పాల్గొన్నారు. నియోజకవర్గంలో ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను కేటీఆర్‌కు వివరించినట్లు జాన్సన్‌నాయక్ తెలిపారు. అనంతరం తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలోనూ పాల్గొన్నారు. రేగా కాంతారావు, కోవ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రావొద్దు

మామడ: గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా పంచాయతీ కార్యదర్శులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రాజీవ్ యువవికాసం పథకాల పురోగతిపై చర్చించారు.

గౌడసంఘం కార్యవర్గం

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామ రేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం గౌడ సంఘం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌడ సంఘం మండలాధ్యక్షుడిగా గరిపెల్లి గంగాధర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్‌గౌడ్, కోశాధికారిగా మేడి సంతోష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రామగౌడ్, సలహాదారులుగా డి.రమణగౌడ్, పడారి రాజేశ్వర్‌గౌడ్, ఉప్పునూతల రాజేశ్వర్ గౌడ్, గౌరవ అధ్యక్షులుగా మేడి నారా గౌడ్, గున్నాల అంజాగౌడ్ ఎన్నికయ్యారు.

'ప్రభుత్వ స్థలం కాపాడాలి'


నర్సాపూర్(జి): మండలంలోని కుస్లి గ్రామంలో కబ్జా చేస్తున్న ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరుతూ మంగళవారం కొందరు గ్రామస్తులు తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో మినీ ట్యాంక్ పక్క న నూతన పంచాయతీ భవన నిర్మాణం కోసం 2023లో భూమిపూజ చేశారు. కానీ పనులు ప్రారంభించలేదు. సదరు స్థలాన్ని గ్రామానికే చెందిన గంగన్న కబ్జా చేసి గుడిసె వేసుకొని నివసిస్తున్నాడు. అధికారులు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలని కోరారు.

పోలేరమ్మకు బోనాలు


బోనాలతో కాలనీవాసులు

ముధోల్: మండలకేంద్రంలోని కోలిగల్లీ కాలనీ వాసులు మంగళవారం పోలేరమ్మకు బోనాలను నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం ప్రతి ఇంటి నుంచి బోనం ఎత్తుకొని మంగళహారతులతో వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా మాదిరి ఈసారి కూడా పంటలు బాగా పండి ప్రజలు సుఖంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

ముధోల్ తహసీల్దార్‌గా శ్రీలత




ముధోల్: ముధోల్ మండల నూతన తహసీల్దార్‌గా మంగళవారం కె.శ్రీలత బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన శ్రీకాంత్ నర్సాపూర్‌కు బదిలీపై వెళ్లగా.. ఆర్మూర్‌లో విధులు నిర్వహించే శ్రీలత బదిలీపై ముధోల్‌కు వచ్చారు. సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు.

దస్తురాబాద్‌లో విశ్వంబర్ ..



దస్తురాబాద్: మండల తహసీల్దార్‌గా మంగళవారం బత్తుల విశ్వంబర్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు.

లోకేశ్వరంలో సర్ఫరాజ్ నవాజ్...



లోకేశ్వరం: మండల తహసీల్దార్‌గా సర్ఫరాజ్ నవాజ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దస్తురాబాద్ తహసీల్దార్‌గా పని చేసే నవాజ్ బదిలీపై లోకేశ్వరం వచ్చారు. లోకేశ్వరంలో పని చేసే మోతీరాం బదిలీపై నిర్మల్ కలెక్టరేట్‌కు వెళ్లారు. నూతన తహసీల్దార్‌కు సిబ్బంది ఘనస్వాగతం పలికారు.



నెలరోజులుగా 'భగీరథ' వృథా

కుభీర్: మండలకేంద్రంలోని బట్టిగల్లి హనుమాన్ ఆలయం వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడటంతో నెలరోజులుగా నీరంతా వృథాగా పోతుంది. లీకేజీకి మరమ్మతు చేస్తామని పంచాయతీ సిబ్బంది పైపులైన్ వద్ద తవ్వారు.. కానీ సమస్య పరిష్కరించలేదు. నడిరోడ్డుపై నీరు వృథాగా పోతుండటంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



కాల్వపై స్లాబ్ మరిచారు..!

కుంటాల: మండలకేంద్రంలోని 12వవార్డులో ఉపాధిహామీ నిధులు రూ.3లక్షలతో ఇటీవల సీసీ రోడ్డు నిర్మించారు. కానీ వాటర్ ట్యాంక్ సమీపంలో మురుగుకాల్వపై స్లాబ్ వేయకుండా వదిలేశారు. రాత్రి రాకపోకలు సాగించే ప్రజలు.. గమనించక అందులో పడి గాయాల పాలవుతున్నారు. అధికారులు మురుగు కాల్వపై స్లాబ్ వేయాలని స్థానికులు కోరుతున్నారు.


సింగన్‌గాంలో..


దాగాం చలివేంద్రంలో కనిపించని కుండ

ఈ చలివేంద్రాల్లో నీళ్లుండవు..

కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు చలివేంద్రాలు ప్రజల దాహం తీర్చడం లేదు. తానూరు మండలంలోని గ్రామాల్లో కొన్నిచోట్ల చలివేంద్రం కోసం వేసిన షెడ్లలో కుండ, తాగునీరు కన్పించడం లేదు. రోజురోజుకు పెరుగుతున్న ఎండలకు జనానికి తాగునీరు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– తానూరు

కార్మిక సంఘాల నిరసన

భైంసాటౌన్: నాలుగు లేబర్ కోడ్ల రద్దుతోపాటు కనీస వేతనం రూ.20వేలు అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద ఆశా కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపారు. జిల్లా నాయకుడు పోశెట్టి మాట్లాడుతూ.. ఈనెల 20న జరిగే సమ్మెను జులై 9కి రీషెడ్యూల్ చేసినందుకు నిరసన తెలిపినట్లు పేర్కొన్నారు. ఆశా కార్యకర్తల యూనియన్ డివిజన్ కార్యదర్శి విజయ, ఇంద్రమాల, విజయలక్ష్మి, డివిజన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుంటాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.బక్కన్న, జిల్లా కార్యదర్శి రామ్‌లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కల్లూరు బీడీ ఫ్యాక్టరీ ఎదుట కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జులై 9కి వాయిదా వేసినట్లు ప్రకటించారు. బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


నిర్మల్‌లో గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా కార్యకర్తలు

నిర్మల్‌చైన్‌గేట్: తమ సమస్యలు పరిష్కరించాలని ఆశ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధ సంస్థ జిల్లా అధ్యక్షురాలు బి.సుజాత అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ, ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. దేశవ్యాప్తంగా జులై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షురాలు శ్యామల, భాగ్య, మంగ, సౌమ్య, లక్ష్మి, అనురాధ, విజయ, తిరుమల, సుమలత, పద్మ, గంగా, లక్ష్మి, శారద, స్వరూప, భారతి పాల్గొన్నారు.


ఖానాపూర్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన

ఖానాపూర్: కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లు చేస్తూ కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు కార్మిక సంఘాలతో ర్యాలీ నిర్వహించి చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. గంగామణి, కమల, వినోద, శేఖర్, నాగరాజు, స్వామి, పోశెట్టి, తదితరులు న్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభం

తానూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా ఉపాధ్యాయులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో నరేందర్ సూచించారు. మంగళవారం తానూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయగా ఆయన కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. శిక్షణ తరగతులకు వందశాతం ఉపాధ్యాయులు హాజరై.. ఇక్కడ నేర్చుకున్న విషయాలను పాఠశాలలో అమలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ తరగతులను ఎంఈవో అశోక్‌వర్మ ప్రారంభించారు. జిల్లా రిసోర్స్ పర్సన్లు షేక్ ఫాజిల్, ప్రవీణ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు పాటించాల్సిన సూచనలు, విద్యార్థులను ఆంగ్ల భాష విధానంపై ఎలా సంసిద్ధుల్ని చేయాలో వివరించారు. ఏఐ, ఆన్‌లైన్, డిజిటల్ సాధనాలను ఉపయోగించుకొని బోధన విధానాలను మెరుగుపరచాలని సూచించారు. మండల రిసోర్స్ పర్సన్లు మోహన్, గంగాధర్, అర్చన, తేజ, చంద్రమోహన్, మారుతి సమక్షంలో శిక్షణ నిర్వహిస్తుండగా మండల సీఆర్పీలు సుధాకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయా గ్రామాల ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. మండల ప్రత్యేకాధికారి బాలిక్ అహ్మద్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ మధుసూదన్, ఎమ్మార్పీలు శ్రీధర్‌బాబు, అంబరీశ్, గంగన్న, రవీందర్, చంద్రయ్య, నరేందర్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు ఉన్నారు.


మాట్లాడుతున్న తానూరు ఎంఈవో నరేందర్

బోధనలో మెలకువలు పాటించాలి

నర్సాపూర్ (జి): బోధనలో ఉపాధ్యాయులు మెలకువలు పాటించాలని ఎంఈవో సాయన్న సూచించారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయులకు మండలస్థాయి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం పురుషోత్తం తదితరులున్నారు.

దస్తురాబాద్: ఉపాధ్యాయులు అభ్యసన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో గంగాధర్ సూచించారు. మంగళవారం మండలంలోని మున్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షన తరగతులు ఏర్పాటు చేశారు.

30న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఖానాపూర్: ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 చెల్లించి పెండింగ్ డబ్బులు విడుదల చేయాలనే డిమాండ్‌తో ఈనెల 30న కలెక్టరేట్ ఎదుట తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ కోరారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతిభవనం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూరి తిరుపతి, జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, రాపెల్లి రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

బీజేపీ పట్టణ కార్యవర్గం

భైంసాటౌన్: బీజేపీ పట్టణ కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నట్లు పట్టణాధ్యక్షుడు రావుల రాము ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే పి.రామారావు పటేల్, పార్టీ జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్ ఆదేశాల మేరకు పట్టణ కార్యవర్గం ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యక్షులుగా సీహెచ్. వెంకటేష్, గాలి రాజన్న, తూమోల్ల దత్తాత్రి, గడ్డం సాయినాథ్, ప్రధాన కార్యదర్శులుగా దగ్డే శ్రీకాంత్, సిందే కపిల్, కార్యదర్శులుగా శాంత, సుభాశ్, శంకర్, మన్మోహన్, కోశాధికారిగా ఉమేశ్ పురోహిత్‌తో సభ్యులను ఎన్నుకున్నట్లు వివరించారు.

తరలింపులో జాప్యం వద్దు

దస్తురాబాద్: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన వరిధాన్యాన్ని తరలించడంలో జాప్యం చేయొద్దని తహసీల్దార్ బి.విశ్వంబర్.. నిర్వాహకులకు సూచించారు. మంగళవారం మండలంలోని ఆకొండపేట, దేవునిగూడెం, దస్తురాబాద్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఆర్ఐ రచన, సంతోష్ తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: మండలంలోని మేడంపల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం మండల ప్రత్యేక అధికారి జీవరత్నం పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి వెంటనే తరలించేలా చర్యలు చేపట్టాలని నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, ఏపీఎం భోజన్న తదితరులు ఉన్నారు.

కొండగట్టుకు స్వాములు

కుభీర్: మండల కేంద్రమైన కుభీర్‌కు చెందిన అంజనేయ స్వాములు మాల విరమణకై మంగళవారం కొండగట్టుకు వాహనాలలో తరలివెళ్లారు.ఇరుముడులు కట్టుకొని పూజ,భిక్షచేసి వెళ్లారు.వీరితోపాటు,దార్‌కుభీర్,బెల్గాం,పార్డి(కె) తదితర గ్రామాల నుంచి స్వాములు కొండగట్టుకు వెళ్లారు.

'ప్రజాదరణ ఓర్వలేకనే అక్రమ కేసు'

కడెం: బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భుక్యా జాన్సన్‌నాయక్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను ఓర్వలేకనే ఆయనపై అక్రమ కేసు నమోదు చేశారని ఆ పార్టీ మండలాధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మొలుగూరి రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం కడెం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. 17 నెలల కిందట ఉట్నూర్ మండలంలోని కొత్తగూడ చెక్‌పోస్ట్ వద్ద అసెంబ్లీ ఎన్నికల వేళ జరిగిన ఘటనకు ఇప్పుడు కేసు సరికాదని పేర్కొన్నారు. ఇందులో జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు రఫీక్‌అహ్మద్, సతీశ్, రంజిత్, కొప్పుల లచ్చన్న, తిరుపతిరెడ్డి, శివయ్య, స్వామి, గంగన్న, రవి, కోటయ్య ఉన్నారు.

దస్తురాబాద్: బీఆర్‌ఎస్ నాయకులు జాన్సన్‌నాయక్‌పై కేసు నమోదు సరికాదని మాజీ వైస్ ఎంపీపీ రాజునాయక్, ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. మంగళవారం దస్తురాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శంకర్, గంగన్న, తిరుపతి, రాజు, కలిరాం, కునాల్, దినేశ్ పాల్గొన్నారు.


ఖానాపూర్‌లో మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: ఎన్నికల వేళ జరిగిన ఘటనకు సంబంధించి జాన్సన్‌నాయక్‌పై కేసు నమోదు చేయడం హేయమైన చర్య అని బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు టి. రాజగంగన్న, గౌరీశంకర్ రాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఆవరణలో మాట్లాడారు. కొక్కుల ప్రదీప్, మోహిద్, పుప్పాల గజేందర్, వాల్‌సింగ్, కొడారి గోపాల్, మహేందర్, సుమిత్, చంద్రహాస్, వాహబ్, ధర్మరాజు, దివాకర్, లాజర్, కళావతి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

రుణాలపై అవగాహన

దస్తురాబాద్: బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలని టీజీబీ మేనేజర్ శ్రీకాంత్ సూచించారు. మంగళవారం దస్తురాబాద్‌లో రైతులు, వినియోగదారులతో మాట్లాడారు. వ్యవసాయ భూములపై రైతు నేస్తం ద్వారా రూ.15లక్షల వరకు హార్వెస్టర్, వాహన, ఎడ్యుకేషన్, మార్ట్‌గేజ్, గృహ, బంగారు , పశువుల కొనుగోలుకు రుణాలు అందిస్తున్నామని.. ఆసక్తి కల్గిన వారు బ్యాంకుల్లో సంప్రదించాలని పేర్కొన్నారు. డెస్క్ మేనేజర్ గీత, టీజీబీ మేనేజర్ నరేశ్, మధుకర్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్ డెస్క్ ఏర్పాటు

బాసర: కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కును తహసీల్దార్ పవన్ చంద్ర ప్రారంభించారు. మండల ప్రజలు మీసేవ కేంద్రంతోపాటు తహసీల్దార్ కార్యాలయంలోసరైన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఖానాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎంఏ మాజిద్ అన్నారు. మంగళవారం మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇటీవల పదోతరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థుల చిత్రపటాలతో కూడిన పోస్టర్‌ను వీడీసీ, పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. హెచ్‌ఎం నరేందర్‌రావు, వీడీసీ అధ్యక్షుడు అడ్వాల శంకర్, గ్రామస్తులు రాజిరెడ్డి, గజేందర్, లక్ష్మణ్, మధు, ఉపేందర్, ఎర్రన్న ఉన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

నర్సాపూర్(జి): గ్రామపంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని రాంపూర్ గ్రామ పంచాయతీని మంగళవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం శానిటేషన్ , సెగ్రిగేషన్ షెడ్, నర్సరీలను పరిశీలించారు. వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యదర్శి నవనీత్‌కుమార్, కారోబార్ గంగారాం, ఫీల్డ్ అసిస్టెంట్ రాజ్‌మహమ్మద్ ఉన్నారు.

'ఒకే దేశం ఒకే ఎన్నిక'పై అవగాహన

ఖానాపూర్: పట్టణంలోని ఎస్సార్ కళాశాల విద్యార్థులకు మంగళవారం బీజేపీ నాయకులు ఒకే దేశం ఒకే ఎన్నికపై అవగాహన కల్పించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే కలిగే లాభాలను వివరించారు. ఉపేందర్, మనోజ్, రవీందర్‌రెడ్డి, స్వామి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు..!

- ముధోల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యేల మధ్య కోల్డ్ వార్
- పలు సందర్భాల్లో బయటపడుతున్న లుకలుకలు



భైంసాటౌన్: ముధోల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధి కాంగ్రెస్ పార్టీలో ఆధిపత్య పోరు నడుస్తున్నట్లు తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్యేలు బి.నారాయణ్‌రావు పటేల్, జి.విఠల్‌రెడ్డి నడుమ కోల్డ్‌వార్ స్పష్టంగా కనిపిస్తోంది. పైకి అంతా కలిసున్నామనే చెబుతున్నా.. పలు సందర్భాల్లో లుకలుకలు వేదికలపై బయట పడుతున్నాయి. ఇటీవల పట్టణంలో నిర్వహించిన అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల కార్యవర్గ సమావేశం రసాభాసగా మారిన విషయం తెలిసిందే. పార్టీలో వెనుక చేరిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారంటూ విఠల్‌రెడ్డిని ఉద్దేశిస్తూ.. పటేల్ వర్గీయులు గొడవకు దిగారు. దీంతో పార్టీ రాష్ట్ర నాయకుల ముందే విఠల్‌రెడ్డి, పటేల్ వర్గీయులు పరస్పరం వాగ్వాదానికి దిగారు. రాష్ట్ర నాయకులు కలుగజేసుకోవడంతో సద్దుమణిగింది. అనంతరం నాయకులు తామంతా ఒక్కటేనని వేదికపై ప్రకటించారు.

వైరల్‌గా వాట్సాప్ సందేశం..

ఇటీవల రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి కుంటాల మండలంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు హాజరయ్యేందుకు భైంసా వచ్చారు. ఆయనకు స్వాగతం పలికేందుకు విఠల్‌రెడ్డి వర్గీయులు, నారాయణ్‌రావు పటేల్ వర్గీయులు హెలీప్యాడ్ వద్దకు వచ్చారు. అయితే మంత్రికి స్వాగతం పలికేందుకు నారాయణ్‌రావు పటేల్ వర్గీయులు అధిక సంఖ్యలో వచ్చారని.. మంత్రి తిరిగి వెళ్లే సమయంలో విఠల్‌రెడ్డి, ఆయన అనుచరులు లేకపోవడంతో, పట్టుమని పది మంది కూడా లేరంటూ విఠల్‌రెడ్డి వర్గీయులను ఉద్దేశిస్తూ.. ఎద్దేవా చేసేలా ఓ వాట్సాప్ సందేశం స్థానిక గ్రూపుల్లో వైరల్‌గా మారింది. దీనికి స్పందిస్తూ విఠల్‌రెడ్డి వర్గీయులు కౌంటర్ మెసేజ్‌లు మొదలుపెట్టారు. ఎవరి బలం ఏంటో ప్రజలకు తెలుసని చురకలంటిస్తున్నారు. ఇలా.. ముధోల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు కార్యకర్తలను అయోమయానికి గురి చేస్తున్నాయి.

విఠల్‌రెడ్డికి ప్రాధాన్యం ఇవ్వడంతోనే..

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్ కాంగ్రెస్ పార్టీలో చేరి, ఎమ్మెల్యేగా పోటీ చేశారు. విఠల్‌రెడ్డి బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి ఓటమి చెందారు. అనంతరం కొద్దిరోజులకు విఠల్‌రెడ్డి సైతం కాంగ్రెస్‌లో చేరగా, నారాయణ్‌రావు పటేల్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి ప్రాధాన్యం ఇస్తుండటంతో విబేధాలు నెలకొన్నట్లు తెలుస్తోంది.

సమష్టిగా ముందుకు సాగాలంటున్న క్యాడర్..

లోక్‌సభ ఎన్నికలతోపాటు, ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలోనూ విబేధాల కారణంగా పార్టీ అభ్యర్థులు ఓటమి చెందినట్లు పార్టీవర్గాలు చర్చించుకుంటున్నాయి. సమష్టిగా ముందుకు సాగాల్సిన ఇద్దరు నేతల మధ్య ఆధిపత్య పోరు పార్టీకి నష్టం వాటిల్లుతోందని.. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే మరింత నష్టం జరుగుతుందన్న చర్చ నడుస్తోంది. గ్రూపు రాజకీయాలు వీడి పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మత్తు రహిత జిల్లాగా మారుద్దాం

- ఎస్పీ జానకీ షర్మిల

దిలావర్‌పూర్: కొందరు యువత గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను సేవిస్తూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని.. నిర్మల్‌ను మత్తు రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ జానకీ షర్మిల కోరారు. ఇటీవల జిల్లా పోలీస్‌శాఖ మత్తు పదార్థాల ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్ 87126 59599ను ఏర్పాటు చేశారు. మంగళవారం దిలావర్‌పూర్ మండలంలోని గుండంపల్లిలో గంజాయి సేవిస్తున్నారని పలువురు ఈ నంబర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయం ఎస్పీ దృష్టికి వెళ్లడంతో ఆమె గ్రామంలో సుడిగాలి పర్యటన చేశారు. ఈసందర్భంగా స్థానిక పోలీసులు ఒక యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ చదువుకునే యువత మత్తుపదార్థాలకు దూరం ఉండాలని పేర్కొన్నారు. గుండంపల్లి గ్రామస్తులు గంజాయి గురించి తమకు సమాచారం ఇవ్వడం హర్షనీయమన్నారు. తాము ఎల్లవేళలా తోడుగా ఉంటామని ఎస్పీ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఎస్పీ వెంట సిబ్బంది ఉన్నారు.


అవగాహన కల్పిస్తున్న జిల్లా ఎస్పీ జానకీ షర్మిల

బ్రహ్మోత్సవాలకు వేళాయె..

- నేటి నుంచి మూడు రోజుల వేడుకలు

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి మూడు రోజులు నిర్వహించనున్నట్లు వీడీసీ కోశాధికారి జిలకర వేణు, రైటర్ బట్టు గంగాధర్ తెలిపారు. ఈసందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు. వీడీసీ సభ్యులు మాట్లాడుతూ బుధవారం స్వామివారి అభిషేకం, స్వస్తి పుణ్యాహవచనం రక్షాబంధనం, అంకురారోహణం, కులదేవత స్థాపన, అగ్నిప్రతిష్ఠ, ధ్వజరోహణం, బలిహరణం గరుడ ముద్దులు, సామూహిక కుంకుమార్చనలు, గురువారం కర్మణ పుణ్యహవాచనం, నిత్య హోమం బలిహరణం, అనంతరం స్వామిఅమ్మవార్ల, పల్లకి ఊరేగింపు నిర్వహిస్తారు. చివరిరోజైన శుక్రవారం స్వామివారి ప్రత్యేక అలంకరణ, నిత్యార్చన, శేష హోమం, పూర్ణాహుతి, ఎదుర్కోళ్లు, స్వామివారి కల్యాణ మహోత్సవం, పుష్పయాగం ఏకాంత సేవ కార్యక్రమాలను శ్రీమన్ నరసింహ మూర్తి, శ్రీమన్ ముద్ర రాజ్యం వెంకటరామకష్ణ ఆచార్యులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.


న్యూవెల్మల్‌లో ముస్తాబైన ఆలయం